స్థాపితం : 1930 LONGEST LIVING NEWS PAPER IN TELUGU JOURNALISM Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 77 సంచిక :46 17.11.2006 శుక్రవారం 12పేజీలు విడిప్రతి: రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

☆ బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్‌టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో , అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)

☆ ప్రతి రోజూ వివిధ రకాల వెజ్&నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160/-లకే

మరెన్ని వసతులతో మీకు స్వాగతం పలికే
మీ డి.ఆర్. ఉత్తమ ☆ ☆ ☆ హోటల్

D.R. UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

### సిఎం సర్వేలో తేలిన నిజం

# ఎమ్మెల్యేల వల్లే ప్రభుత్వ పరువు గంగ పాలు!

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను దారికి తేవడం ఎట్లా అన్న సూక్ష్మం బోధపడక తల పట్టుకొంటున్నాడు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి. రెండున్నరేళ్ల తన పరిపాలనపై ఆయన ఒక సర్వే నిర్వహించారు. ఇంటెలిజెన్స్ ఐజి అరవిందరావు, స్పెషల్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కెవిపి రామచంద్రరావు వంటి అతి కొద్ది మంది ఆంతరంగికులతో దానిపై విస్తృత చర్చ జరిపారాయన. దాని ఫలితాలు చూడగానే, ఆయనకు ఒళ్లంతా తేళ్లు, జెర్రులు పాకిన అనుభూతి కల్గిందని చెప్తున్నారు. ఈ సర్వేలో తేలిన కీలక అంశం – కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కాంగ్రెస్ భవిష్యత్తుకు ప్రమాదకారులుగా పరిణమించారన్న నిజం. ప్రజలలో ప్రభుత్వం పట్ల పెద్దగా వ్యతిరేకత లేదని, ముఖ్యమంత్రి అంటే, అభిమానం ఎంతమాత్రం తరగలేదని; అయితే ఎక్కడికక్కడ ఎమ్మెల్యేల మీద మాత్రం జనం కోపంతో మండిపడుతున్నారని; వారినే తిరిగి అభ్యర్థులుగా నిలబెడితే మాత్రం రేపటి ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు అసాధ్యమని సర్వే నిర్ధారించిందట. ఆంధ్రజ్యోతి దినపత్రిక నిర్వహించిన సర్వే కూడా ఇంచుమించు ఇదే ఫలితాన్ని తేల్చి చెప్పింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో కన్పిస్తున్న ప్రధాన లోపం – తమ తమ నియోజకవర్గాల మీద పట్టు కోల్పోవడం అనే నిర్ధారణకు వచ్చారు ముఖ్యమంత్రి. ఆయన అభిప్రాయం సరైనదే. ముఖ్యమంత్రి తమకిచ్చిన చనువు, అధికారాన్ని ముప్పాతిక భాగం ఎమ్మెల్యేలు దుర్వినియోగం చేశారు. తమను తాము రాజులుగా ఊహించుకొంటూ, ముఖ్యమంత్రి పేరు చెప్పి అధికారుల మీద అలివిమాలిన పెత్తనం చేయడంతో పాటు, అవినీతికి, అహంకారానికి అలవాటు పడిపోయారు. ఈ విపరీత ప్రవర్తన వారిని జనానికి దూరం చేసింది; కాంగ్రెస్ కార్యకర్తలు కూడా చిన్నబుచ్చుకునే పరిస్థితి తలెత్తింది.

ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేస్తున్నా; ప్రజలను ఆకట్టుకోవడానికి అత్యంత వుదారంగా వేల కోట్ల రూపాయలు క్రుమ్మరిస్తున్నా; ప్రజల జీవన ప్రమాణాలను పెంచే పథకాలు రోజుకొకటిగా అమలు చేస్తున్నా, ఎమ్మెల్యేల తప్పుడు ప్రవర్తనతో అవన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందంగా తయారౌతున్నాయి. ఈ రెండున్నరేళ్లలో అధిక భాగం కాంగ్రెస్ ఎమ్మెల్యేల జీవన శైలిలో ఎంతమార్పు వచ్చిందో వర్ణించలేము. వారు కొన్న కార్లు, వారు గడుపుతున్న విలాస జీవితం, వారు ఆర్జిస్తున్న ఆస్తులు, భూ కబ్జాలు, టెండర్ల గోల్మాళ్లు, ప్రతి పనిలో కమీషన్లు జనం దృష్టిని తప్పించుకోలేక పోతున్నాయి. అందినంత దోచుకోవడం తమ హక్కు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు ఎమ్మెల్యేలు.

తరువ 12వ పేజీలో

## పాము పగ, జాగ్రత్త!

"తాచు పాము తోక తొక్కాము, జాగ్రత్తగా వుండండి; ఆదమరిస్తే కాటు వేస్తుంది"... రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ముఖ్యమంత్రి చేసిన హెచ్చరిక ఇది. మార్గదర్శి వ్యవహారం రచ్చకెక్కిన తర్వాత జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో రెవెన్యూ మంత్రిని దగ్గరకు పిలిచి మరీ ఈ హెచ్చరిక చేశారట ఆయన. ఈ కేబినెట్ సమావేశంలో రామోజీ ఫిల్మ్‌సిటీ భూముల అక్రమాలపై చర్చ జరపాలని తలపెట్టారు. అయితే అప్పటికే తాము ప్రయోగించిన మార్గదర్శి అస్త్రం విఫలం అయ్యిందని అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి, ఇక నుంచి వేసే అడుగు అయినా జాగ్రత్తగా, ఆలోచించి వేయాలనే నిర్ణయానికి రావడంతో, చర్చ ప్రక్కన పెట్టేశారు. తన మంత్రులలోనే కొందరు రామోజీరావు మెహర్బానీ కోసం మాటలు మోసే ప్రమాదం వుందన్న భయం కూడా ఒక కారణం అని చెప్తున్నారు.

# ఈనాడుకు జనం సానుభూతి

ఈనాడు అధినేత రామోజీరావుపై ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రారంభించిన పోరాటంపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. వ్యక్తిగతంగా ఆయన పెంచుకున్న కక్షకు మొత్తం కాంగ్రెస్ పార్టీ ఎందుకు మూల్యం చెల్లించాలి అని ప్రశ్నిస్తున్నారు పలువురు కాంగ్రెస్ వాదులు. అధికభాగం ఎమ్మెల్యేలలో కూడా ఇదే భావం వ్యక్తం అవుతున్నది. ముఖ్యమంత్రి అవుననుకున్నా, కాదనుకున్నా ఈనాడు దినపత్రిక, రాష్ట్రంలో అత్యధికులు చదివే పత్రిక. రాష్ట్ర ప్రభుత్వం గురించి కానీ, పార్టీ గురించి కానీ, నాయకుల గురించి కానీ ప్రజలకు సమాచారం చేరవేసే అత్యంత కీలక సాధనం. ఆ పత్రికలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మీద తీవ్రమైన వ్యాఖ్యలు వస్తున్న మాట నిజం. అది కేవలం కక్షతో వ్రాస్తున్నదని అనుకోవడానికి కూడా లేదు. ఈనాడులో వచ్చిన చాలా వార్తలకు సమాధానాలు చెప్పుకోలేని స్థితిలో పడిపోతున్నది ప్రభుత్వం. మంత్రులు, ముఖ్యమంత్రి అనుచరులు, ఎమ్మెల్యేలు, అధికారుల చేసే అవినీతి పనులను సాక్ష్యాలతో సహా ప్రజల ముందు పెడుతున్నది ఈనాడు. ఆ వార్తలు తప్పు అనుకుంటే, వివరణ ఇవ్వవచ్చు. సమాధానం చెప్పవచ్చు. ఖండన జారీ చేయవచ్చు. అవేవీ చేయకుండా, తన మీద కక్షతో వార్తలు వ్రాస్తున్నారు అనే విమర్శతో ఆ



వార్తలకు విలువ లేకుండా చేయాలని ప్రయత్నిస్తూ వచ్చాడు ముఖ్యమంత్రి ఇంత కాలం. కమ్మ కుల అభిమానంతో తన మీద కక్ష కట్టారని; చంద్రబాబుకు అమ్ముడు పోయారని రకరకాలుగా ప్రచారం పెట్టారు. ఈనాడు కావాలని వ్రాస్తున్నదనే భావన కొంతమేర పాఠకులలో కూడా కలిగే సూచనలు కన్పించాయి.

ఈ దశలో నేరుగా ఈనాడు మీద దాడి ప్రారంభించాడు ముఖ్యమంత్రి. ఇది పార్టీకి కానీ, ఆయనకు కానీ ఎంతవరకు మంచిది అన్నది ప్రశ్న. ఇంతకాలం ఈనాడు తన మీద కక్ష కట్టింది అని చెప్తూ వచ్చిన వాడు, ఇప్పుడు తానే ఈనాడు మీద కక్ష కట్టినట్లు జనం భావించే పరిస్థితి తెచ్చుకొన్నాడు. ఈనాడు మీద కక్ష ఎందుకు? తన తప్పులు బయట పెడుతున్నదనే కదా? అనే చర్చ జనంలో తలెత్తుతున్నది. దానివల్ల ఈనాడు పట్లనే జనంలో సానుభూతి కల్గుతున్నది. ఆ పత్రిక వార్తల విశ్వసనీయతను పెంచే పరిణామం అది.

ఈనాడు దినపత్రిక మొత్తం కాంగ్రెస్ పార్టీకే శత్రువు అన్న భావం పెంచి పోషించడం వల్ల, జిల్లా స్థాయిలో తాము చాలా ఇబ్బంది పడవలసి వస్తుందని ఎమ్మెల్యేలు ఆవేదన చెందుతున్నారు. ఈనాడులో ఏ వార్త వస్తుందో అని హడలి చచ్చే

తరువ 6వ పేజీలో

# శెభాష్ పనబాక

కేంద్రమంత్రి పనబాక లక్ష్మికి ముఖ్యమంత్రి నుంచి మెప్పు లభించింది. కరీంనగర్ ఉప ఎన్నికల ప్రచారంలో బీడీ



కార్మికుల సమస్య ఒక వివాదంగా మారిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, బీడీ కట్టల మీద భయం కొలిపే పుర్రె బొమ్మ ముద్రించాలని కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీనివల్ల బీడీల వినియోగం తగ్గే ప్రమాదం వుందని కార్మికులు భయపడుతున్నారు. కరీంనగర్‌లో వారు పెద్ద సంఖ్యలో వున్నారు. ఈ నేరాన్ని టిఆర్ఎస్ అధినేత చంద్రశేఖరరావు పైకి నెట్టి తప్పించుకోవాలని చూశాడు ముఖ్యమంత్రి. ఆయన కార్మిక మంత్రిగా వున్నప్పుడే ఈ వుత్తర్వు వచ్చిందని కార్మికుల సభలో ఆరోపించారు. అయితే చంద్రశేఖరరావు ఆ ప్రక్క రోజే, వుత్తర్వు కాపీలను బయటపెట్టి, దాని మీద సంతకం పెట్టింది కాంగ్రెస్‌కు చెందిన పనబాక లక్ష్మి అని నిరూపించాడు.

తరువ 6వ పేజీలో

ఆత్మీయుల మరణం, శ్రద్ధాంజలి, సానుభూతి
ప్రకటనలకు జమీన్‌రైతులో రాయితీ

కుటుంబంలోని వ్యక్తులు, బంధువులు, ఆత్మీయులు, స్నేహితుల మరణాలు మనసును విలవిలలాడేట్లు చేస్తాయి. ఇటువంటి విషాద సందర్భాలలో మనలోని బాధను, గతించిన వ్యక్తుల తాలుకు వివరాలను పది మందికి తెలియజేసే ప్రకటనలకు 'జమీన్‌రైతు' ప్రత్యేక రాయితీనిచ్చి చేయూతగా నిలుద్దామని సంకల్పించింది.

ఈ ప్రకటనలను నేరుగా 'జమీన్‌రైతు' ఆఫీసుకు తెచ్చిచ్చి, ప్రకటన ప్రచురితమయ్యేందుకు అయ్యే ఖర్చును ఏకమొత్తంగా వెంటనే చెల్లించిన వారికి 25% రాయితీ ఇవ్వదలిచాము. ఎన్నోఏళ్లుగా నెల్లూరీయులకు జరిగే మంచిలోనూ, బాధలోనూ చేయూతగా నిలిచిన 'జమీన్‌రైతు' కొద్దో గొప్పో ఆసరాగా వుండేందుకు ఈ నిర్ణయానికి వచ్చింది.

పాఠకులు, ప్రకటనదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోమనవి.

జమీన్‌రైతు, ఫోన్: 0861 – 2327354, సెల్ : 98489 66163, 98489 66165

## బుచ్చి ఎస్ఐ

5వ పేజీ తరువాయి

రూపాయల నాబార్డు నిధులతో నిర్మింప తలపెట్టిన కళాశాల అదనపు భవన నిర్మాణ పనులకు మంత్రి శంకు స్థాపన చేసి మాట్లాడారు. పంచాయతీ రాజ్ శాఖ, ఇంజినీరింగ్ శాఖాధికారులు త్వరత్వరగా ఈ హాస్టల్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. బంగారుపేట బిసి కాలనీలో సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం క్రింద ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన అదనపు భవనాన్ని, కుమ్మర మిట్టలో పట్టణ శాశ్వత గృహ నిర్మాణ పథకంలో భాగంగా 20 లక్షలు వెచ్చించి నిర్మించిన 51 గృహాలను మంత్రి ప్రారంభించారు. వెంకటగిరి మునిసిపల్ ఛేర్మన్ అల్లం చంద్రమోహన్, హౌసింగ్ డిఎం వెంకటరెడ్డి, ఎమ్మార్వో స్వామినాథన్, చిమ్మిట శేషయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సర్వేపల్లిలో అధికార్ల ఇష్టారాజ్యం!

సర్వేపల్లి నియోజక వర్గ పరిధిలోని ఐదు మండలాలలో అధికార్లదే ఇష్టారాజ్యం అయ్యింది. వీరు ఎమ్మెల్యేని గాని కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే అధికార్లు అందినంత మేర దోచుకొంటున్నారు. అధికార్లతో సమీక్షా సమావేశాలు నిర్వహించి లోపాలను హెచ్చరించక పోవడం, ఎమ్మెల్యే మెతకవైఖరిని అధికారులు తమకు అనుకూలంగా మలుచుకొంటున్నారు. వివిధ పనులపై వచ్చే వారిని అందినంత వరకు తవిడి బస్సు ఛార్జీలు కూడా మిగలకుండా చేస్తున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, సర్టిఫికేట్లు, లీగల్ హైర్స్ తదితర ప్రధాన విషయాలకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఎమ్మార్వోల వద్ద సంతకం కావాలంటే పైసామే పరమాత్మ అన్నట్లు సమర్పించుకొని పనులు చక్కబెట్టుకోవాల్సి వస్తుంది. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సంబంధిత అధికార్లకు ఫోను చేసినా రిసివర్ ఎత్తడం లేదు. చిన్న చిన్న పనులు కూడా బతిమిలాడితే కాని చేయడం లేదు. ఎమ్మెల్యే కార్యాలయంలో పిఏలు కూడా సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపక పోవడంతో ఆదాల కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య దాదాపు తగ్గింది. తోటపల్లి గూడూరు ఎమ్డీఓ, స్థానిక ఎన్నికల సమయంలో పెట్రోలు వాడకం పేరుతో భారీగా నిధులు దిగమింగారు. అంతటితో ఊరుకోక ఇటు కాంగ్రెస్, అటు తెలుగు దేశం నాయకుల నుంచి భోజనం ఖర్చులకు దండుకోవడం జనం చర్చించుకొంటున్నారు. యువశక్తి గ్రూపు నుంచి కూడా వచ్చినంత వరకు సర్దుకున్నారు. ఎన్నికల సమయంలో పనిచేసిన కార్యదర్శులకు, కంటింజెంటు సిబ్బందికి కాకికి విదిల్చినట్లు కూడా పైసా ఇవ్వనట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి. స్థానికులు సహకరించినా మాచర్లవారిపాళెంలో ఇళ్ల నిర్మాణం నాసిరకంగా వున్నాయి. స్థానిక కాంట్రాక్టర్ పనులు సరిగ్గా చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. గ్రామ సభలలో కొన్ని సబ్సిడీ లోన్లు ఎస్టీలకు కేటాయించి వుండగా ఎస్సీలకు కోటా లేదనడంతో వెంకన్నపాళెంలో ఎస్సీలకు మొండి చేయి మిగిలింది. ఇక ఎమ్మార్వో కార్యాలయం అవినీతికూపంగా మారింది. ఇక్కడ ఒక గ్రామ కార్యదర్శి మూడూళ్ల పెత్తనం చేస్తూ చిన్నచెరుకూరుకు చెందిన శేషయ్య అనే దళారిని స్నేహితునిగా చేసుకొని, ఫోటోలు తీయించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఎమ్మెల్యేతో తమకు మంచి పరిచయాలున్నాయని, రోజు ఫోనులో మాట్లాడుతుంటారని ప్రచారం చేసుకొంటున్నారు. ఎమ్మార్వో కార్యాలయాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని నడిపిస్తున్నారు. వాస్తవాలు ఎమ్మెల్యేకు వివరించి పరిష్కార మార్గం ఆలోచించే కాంగ్రెస్ నాయకులు లేకపోవడంతో నియోజక వర్గంలో అధికార్ల పెత్తనంతో జనం విసిగి పోతున్నారు.

## ఉదయగిరిలో రాజకీయ సెగలు

ఉదయగిరి నియోజక వర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక మునుపెన్నడూ లేనివిధంగా గ్రామాల్లో వైరి వర్గాల్లో కక్ష సాధింపు ధోరణులు రగులుతున్నాయి. ఫలితంగా ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు పార్టీలు, పట్టింపులనే తారతమ్యం లేకుండా ఎంతకైనా తెగబడుతున్నారు. ఆయా పార్టీల నాయకులకు తమ కేడర్‌పై పట్టు తప్పిందా అన్న సందేహాలు కూడా పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి. వరికుంటపాడు జడ్పీటిసి భోగినేని శ్రీనివాసులునాయుడు, సీతారాంపురం మండలాధ్యక్షుడు నేలటూరు అబ్రహాం, బసినేనిపల్లి సర్పంచ్ భర్త చింతంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, రాచవారి పల్లె సర్పంచ్ బాబా నాగేశ్వరరెడ్డి, భీమవరంలో బి.బ్రహ్మయ్య తదితరులు కేవలం రాజకీయ కారణాలతో పోలీసు కేసుల్లో చిక్కుకొన్నారు. ఇవికాకుండా చిన్నపాటి కాంట్రాక్టు పనులు చేస్తూ రాజకీయ పైరవీలు సాగిస్తూ తిరిగే చోటా నాయకులపై వారు చేస్తున్న పనులపైన సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి అడ్డగించే ఘనులు కూడా అక్కడక్కడా తయారయ్యారు. ఇలాంటి ఇబ్బందులనెదుర్కొంటున్న రాజకీయవాదులు ఉదయగిరి నియోజక వర్గంలో రాజకీయ నాయకులైన మేకపాటి, మాదాల, కంభంలో ఎవరో ఒకరికి అనుచరులుగా కూడా కొనసాగుతుండటం విశేషం. ఎన్నికల్లో గెలిచిన లేదా ఓడిన వర్గం వారు ప్రత్యర్థులను ఇబ్బందులు పెట్టే పనులకు వారి అధినాయకుల అండతోనే ముందుకు వెళ్తున్నారా లేక అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు వెళ్లే వ్యక్తులపై ఆయా పార్టీల అధినేతల పట్టుతప్పిందా అన్న ప్రశ్న రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తుంది. ఈ పెడధోరణులు ఇలాగే కొనసాగితే రానున్నకాలం అసలే కరవు ప్రాంతమైన ఉదయగిరి పల్లెల్లో ప్రజా జీవనం కష్టతరం కావటం ఖాయం.



నెల్లూరులో ఆపరేషన్ డెంగ్యూ కార్యక్రమం ఎంత తూతూ మంత్రంగా చేపడుతున్నారో ఈ ఫోటో చూస్తే అర్థమౌతుంది. చెత్తాచెదారం, మురికి నిండిన చోట చేయాల్సిన ఈ కార్యక్రమాన్ని శుద్ధంగా వున్న సిమెంటు రోడ్డుపై చేస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న మేయర్ పులిమి శైలజ, కార్పొరేటర్ భానుశ్రీ, ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, ఎస్పీ కనకారావు.



## రెయిన్‌బో...

# కీర్తి కిరీటంలో మరో కలికితురాయి!

పసిపిల్లల ఆరోగ్య లాలనలో ప్రపంచ స్థాయినందుకున్న హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రి కీర్తి కిరీటంలో మరొక కలికితురాయి జత చేరింది. తల్లి గర్భంలో వుండగానే, శిశువులోని ఆరోగ్య లోపాలను గుర్తించి, సరి చేయుగల అత్యాధునిక పెరినేటల్ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభించారు. 14తేది బాలల దినోత్సవం సందర్భం నాడు, ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఈ కేంద్రానికి రిబ్బన్ కత్తిరించారు. ఎప్పుడో అరుదుగా తప్ప ఇల్లు వదలి బయటకు రాని ముఖ్యమంత్రి సతీమణి శ్రీమతి వైఎస్ విజయలక్ష్మి ఈ సభకు రావడమే కాక, బర్త్ సెంటర్‌కు తన చేతులతో తలుపులు తెరవడం విశేషం. ఆర్థిక మంత్రి రోశయ్య, ప్రత్యేక వైద్యులు ప్రొఫెసర్ రాజశేఖరన్, ప్రొఫెసర్ సరళా గోపాలన్, వై.సవితాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**హైదరాబాద్‌లో నెల్లూరీయుడు డాక్టర్ కంచర్ల రమేష్ కొత్తగా కట్టిన రెయిన్‌బో ఆస్పత్రిలో పెట్టిన పెరినేటల్ చికిత్సా కేంద్రం తల్లీబిడ్డల పాలిట సంజీవని పర్వతం**

నెల్లూరీయుడు, ఏ దేశంలో వున్నా నెల్లూరు అన్నా, నెల్లూరీయులన్నా ప్రాణమిచ్చే జన్మభూమి ప్రేమికుడు డాక్టర్ కంచర్ల రమేష్, రెయిన్‌బో సంస్థ అధిపతి. లండన్ మహా నగరంలో రెండు చేతులా ఆర్జించే అవకాశం, సుఖప్రదమైన జీవితాలను వదలుకుని, తను నేర్చిన విద్యను తన వారికి ఉపయోగ పెట్టాలన్న తమకంతో హైదరాబాదులో ఈ ఆస్పత్రి నెలకొల్పారాయన. అచిర కాలంలోనే అది దక్షిణ భారతదేశంలోనే పసి పిల్లల పాలిట ప్రాణ ప్రదాయనిగా పేరు తెచ్చుకున్నది. పిల్లలలో వచ్చే గుండె జబ్బులు, కిడ్నీ లివర్ సమస్యలు, నెఫ్రాలజీ, హిమటో అంకాలజీ, న్యూరాజలీ, కార్డియాలజీ, పల్మనాలజీ, రేడియాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు ఇదొక్కటే సరైన ఆస్పత్రిగా గుర్తింపు పొందింది. దాన్ని మరింత సమగ్రము, ఆధునీకము చేయడం కోసమే ఈ పెరినేటల్ చికిత్సా కేంద్రం స్థాపన. కొందరు తల్లులకు గర్భం సమయంలో చాలా ఆరోగ్య సమస్యలు వస్తూ వుంటాయి. ఒక్కొక్కసారి అవి ప్రాణ ప్రమాదానికి దారి తీస్తాయి. కొందరిలో తరచూ గర్భస్రావం జరుగుతూ వుంటుంది. కొందరు శిశువులకు తల్లి కడుపులో వుండగానే రకరకాల సమస్యలు ఎదురౌతూ వుంటాయి. ఇటువంటి సున్నితమైన, క్లిష్టమైన వైద్య చికిత్స ఈ కేంద్రం ప్రత్యేకత. పుట్టగానే చనిపోయే ప్రమాదం నుంచి బిడ్డను, ప్రసవ సమయంలో ప్రాణహాని వున్న తల్లిని రక్షించడం దీని వుద్దేశం. పిల్లలాస్పత్రిలోనే ప్రసవానికి కూడా వసతులు సృష్టించారన్నమాట.

ఈ కేంద్రం ద్వారా రెయిన్‌బో ఆస్పత్రి ఇప్పుడు 150 పడకల సౌకర్యం సంతరించుకున్నది. ఇందులో 60 పడకల వరకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు కేటాయించారు.

రెయిన్‌బో ఆస్పత్రిలోని ఈ నూతన కేంద్రం తల్లీ బిడ్డల పాలిట సంజీవని పర్వతం కావాలని కోరుకొంటున్నాము.



హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో పెరినేటల్ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి. ప్రక్కన డాక్టర్ కంచర్ల రమేష్, ఆరోగ్య మంత్రి రోశయ్య వున్నారు.

## నాదెండ్ల చీకాకు

కాంగ్రెస్ రాజకీయాలలో మొండి శిఖండి వంటివాడు, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు. కాంగ్రెస్‌లోని ఏ వర్గం కూడా ఆయనతో కలవలేదు; సాధారణ ఎమ్మెల్యేల నుంచి సీనియర్ నేతల వరకు ఆయనతో మాట్లాడే వారు లేరు; ఏ పార్టీ కార్యక్రమంలోను ఆయనకు భాగం కల్పించరు; సభలకు పిలవరు. అయినా సరే ఆయన కాంగ్రెస్ పార్టీలో ఏదో ఒక సంచలనం సృష్టిస్తూ వుంటారు. తన ఉనికిని కాపాడుకొంటూ వుంటారు. ఇప్పుడు తాజాగా ఆయన ఢిల్లీ పర్యటనలు ముఖ్యమంత్రికి తలనొప్పి తెచ్చి పెడుతున్నాయి.

ఏమీ తోచనప్పుడల్లా ఢిల్లీ వెళ్లడం నాదెండ్లకు అలవాటు. వెళ్లినప్పుడల్లా ఏదో ఒక మిషతో సోనియాగాంధీని కలుస్తున్నారట. అదృష్టం బాగోలేక, తప్పటడుగులు వేసి, రాజకీయంగా వెనుకబడి పోయాడు కానీ, రాష్ట్రంలో ఎవరికీ తీసిపోని రాజకీయ చతురత వుంది నాదెండ్లకు. రాజకీయ విశ్లేషణలలో కూడా అందె వేసిన చెయ్యి. సోనియమ్మను కలిసినప్పుడల్లా, రాష్ట్ర ప్రభుత్వం మీద, పార్టీ పరిస్థితుల మీద, అవినీతి ఆరోపణల మీద వివరంగా నివేదికలు సమర్పిస్తున్నారట. ఆయన ఏమి చెప్పన్నాడో, వాటిని ఆమె ఎట్లా స్వీకరిస్తుందో అర్థం కాక ముఖ్యమంత్రి వర్గీయులు చీకాకు పడిపోతున్నారు.

ఒక్క హనుమంతరావు తప్ప మరే సీనియర్ నేత కూడా సోనియాగాంధీ వద్దకు వెళ్లి, తమ మీద పితూరీలు విన్పించే అవకాశం లేకుండా చేసుకోవడంలో ముఖ్యమంత్రి శిబిరం ఇప్పటి వరకు సఫలీకృతం అయి వుంది. దానితో ఢిల్లీలో తమ మాటకు ఎదురు లేకుండా చేసుకొని వున్నారు. నాదెండ్ల భాస్కరరావు మాత్రం వారికి కొరుకుడు పడడం లేదు. ఆయన్ను ఎట్లా నియంత్రించాలి, ఢిల్లీలో ఆయన మాటకు విలువ లేకుండా ఎట్లా చేయాలి అనే ఆలోచనలో నిమగ్నమై వున్నారు, ముఖ్యమంత్రి సలహాదారు కెవిపి రామచంద్రరావు.

## గంగ పాలు

మొదటి పేజీ కొరవ

అందుకు ఉపకరించే వారిని మాత్రమే చేరదీస్తున్నారు. పార్టీని కనిపెట్టుకుని వుండే కార్యకర్తలను ప్రక్కకు నెట్టేస్తున్నారు. స్థానికంగా వుండే వారు కాబట్టి, ఎమ్మెల్యేల నడవడిక మీద అనునిత్యం జనం దృష్టి వుంటుంది.

ఎమ్మెల్యేల మీద కోపం, అసూయ, ఆగ్రహం ఎన్నికల నాటికి ప్రభుత్వం మీద తిరుగుబాటుగా మారితే, ఆ నష్టం పూడ్చడం అలివయ్యే పని కాదని ముఖ్యమంత్రి అభిప్రాయ పడుతున్నారు.

తీరు మార్చుకోకుంటే వేటు తప్పదు అనే సందేశం ప్రతి ఎమ్మెల్యేకు స్పష్టంగా చేరవేయడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారం అని భావిస్తున్నారట ఆయన. అందువల్లనే ఇటీవల ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వడం కొంతమేర తగ్గించారు. వారు తెచ్చే కాగితాలను ఇదివరకటి వలె కళ్లు మూసుకుని సంతకం పెట్టడం కాకుండా, అధికారుల పరిశీలనకు పంపుతున్నారు.

అయితే ఎమ్మెల్యేలను నియంత్రించడం, తీరు మార్చడం అంత సులభం కాదన్న నిజం ముఖ్యమంత్రికీ తెలుసు. నేర్పుతో, ఓర్పుతో పరిష్కరించవలసిన సమస్య ఇది.

2007 CALENDARS DIARIES

పంచాగం, ఇంగ్లీషు, ఉర్దూ క్యాలెండర్లు త్వరగా ఆర్డర్లు ఇచ్చిన వారికి సకాలంలో సప్లై చేయబడును.

అరుణ గ్రాఫిక్స్

రాయాజివీధి, నెల్లూరు.

☎ : 2325526, 2340587

పెండ్లిపత్రికలు మా ప్రత్యేకత

We Grow with State Bank of India

ప్రథమ వర్ధంతి



శ్రీ ఒట్టూరు భాస్కర్‌రావు (ఉదయభాస్కర్)

మా ఇంటి దీపం, నిరంతరం మా హృదయాలలో వెలిగే జ్యోతి, మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్ములను తన గుండెలలో దాచుకొన్న ప్రేమమయుడు

మా తండ్రి **శ్రీ ఒట్టూరు భాస్కర్‌రావు** (ఉదయభాస్కర్) గారు

స్వర్గస్తులై 18.11.2006 తేది శనివారం నాటికి ఏడాది గడుస్తుంది. ఈ సందర్భంలో వారిని సంస్మరించుకుంటూ వారి పవిత్రాత్మకు శాంతి కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు : **ఒట్టూరు నవీన్, ఒట్టూరు సంపత్‌రాజు (రాజ)**

(టిడిపి నగర కార్యదర్శి, నెల్లూరు)

METRO DEVELOPERS
Road No:10, Banjarahills
Hyderabad. Ph: 040-23302941, 42, 43

METRO DEVELOPERS
Kuvempu Nagara, Mysore
Ph: 0821-2568570, 2568470

Offset Printing at Zaminryot Press, Nellore.